

దౌల్తాబాద్.. బీఆర్ఎస్ జిందాబాద్: సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండల కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు పాల్గొన్న యువగర్జన సభకు భారీగా హాజరైన యువత

# కాంగ్రెస్‌కు ఓటేస్తే చీకటి రోజులే

## పొరపాటు చేస్తే 50 ఏండ్లు వెనక్కి తీసుకెళ్తరు

- వైర్లను పట్టుకుంటే తెలుస్తది కరెంటు ఉందోలేదో..
- ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతుబంధు దుబారా అంటడు
- భట్టి ధరణి తీసేద్దామంటుండు
- వీళ్లకు రాష్ట్రాన్ని అప్పజెప్పుదామా?
- మన జుట్టు ఢిల్లీ చేతిలో పెట్టొద్దు
- జనవరి నుంచి కొత్త రేషన్ కార్డులు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- దౌల్తాబాద్ యువగర్జన, ముస్తాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్‌లో రోడ్‌షో



యువగర్జనలో ప్రసంగిస్తున్న మంత్రి కేటీఆర్. ప్రజలకు అభివాదం చేస్తున్న అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి

> "తెలంగాణ వాళ్లకు ఎవరికీ 3 ఎకరాల కంటే ఎక్కువ భూమి లేదని రేవంత్‌రెడ్డి అంటున్నారు. 3 గంటల కరెంట్ చాలని, 10 హెచ్‌పీ మోటర్ పెట్టాలని చెప్తున్నారు. అసలు రేవంత్‌కు, రాహుల్‌గాంధీకి ఎద్దు, ఎవుసం గురించి ఏమీ తెల్వదు. వారికి కేవలం క్లబ్‌ల గురించి, పబ్బుల గురించి మాత్రమే తెలుసు.
> -మంత్రి కేటీఆర్

సిద్దిపేట, నవంబర్ 21( నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ హైదరాబాద్ సిటీబ్యూరో/రాజన్న సిరిసిల్ల, (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ చీకటి రోజులే వస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారక రామారావు ప్రజలను హెచ్చరించారు. ఈ ఎన్నికల్లో పొరపాటు చేస్తే మళ్లీ 50 ఏండ్లు వెనక్కి పోతామని, 1956లో చేసిన తప్పుకు 58 ఏండ్లు పట్టిందని అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని దౌల్తాబాద్‌లో యువగర్జన, రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో నిర్వహించిన రోడ్‌షోల్లో మంత్రి కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాక ముందు కాంగ్రెస్ పాలనలో కరెంట్ ఎట్ల ఉండే.. ఇప్పుడు ఎలా ఉందో ఆలోచించాలని సూచించారు. నాడు కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు, అర్ధరాత్రి కరెంట్, ఎండిన చెరువులు ఉండేవని గుర్తుచేశారు. స్వరాష్ట్రంలో నేడు కరెంట్ కష్టాలు లేవని, 24 గంటల నిరంతర నాణ్యమైన విద్యుత్తు సరఫరాతో రైతన్నలు సంబురంగా సాగు చేసుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ వాళ్లు ఇప్పుడు కరెంట్ గురించి మాట్లాడుతున్నరని, తామే రెండు బస్సులు ఏర్పాటు చేస్తామని.. రాష్ట్రంలోని ఏ ఊరికి వెళ్తారో వెళ్లి.. కరెంట్ తీగలు పట్టుకుంటే తెలుస్తుందని సవాల్ విసిరారు. తెలంగాణ ఎవరి చేతుల్లో ఉంటే సురక్షితంగా ఉంటుందో ఆలోచించి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఉప ఎన్నిక సమయంలో ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు.. మళ్లీ మోసం చేసేందుకు కొత్త హామీలు ఇస్తున్నారని విమర్శించారు. బీజేపీని నమ్మి ఓటేస్తే రూ.400 ఉన్న సిలిండర్ ధర రూ.1200కు పెంచారని, డిసెంబర్ 3 తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.400కే సిలిండర్ అందిస్తుందని హామీ ఇచ్చారు. వచ్చే జనవరి నుంచి కొత్త రేషన్ కార్డులు అందిస్తామని తెలిపారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడని, కత్తిపోట్ల రాజకీయానికి ఓటుపోటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

### అలిగిన, గులిగినా మనోళ్లమీదనే..

'కాంగ్రెస్‌కు ఓటేస్తే రాహుల్‌గాంధీకి.. బీజేపీకి వేస్తే నరేంద్రమోదీకి పోతుంది. కేసీఆర్‌కు తెలంగాణపై ఉన్న ప్రేమలో మీసమెత్తయిన ఢిల్లీవాళ్లకు ఉంటుందా? అలిగిన, గులిగినా మనోళ్ల మీదనే ఉండాలని, ఢిల్లీ వాళ్ల చేతిలో మళ్ల జుట్టుపెడితే బతుకులు ఆగమైపోతాయి' అని కేటీఆర్ హెచ్చరించారు. కులం పేరుతో, మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మొద్దని కోరారు. ముస్తాబాద్ రోడ్‌షోకు హాజరైన కేటీఆర్‌ను చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

నాడు కరెంటు ఇయ్యకుండా రైతులు, ప్రజలను గోసపెట్టిన కాంగ్రెస్ నేతలకు నేడు కరెంటు గురించి మాట్లాడేందుకు సిగ్గుండాలన్నారు. కాళ్లలో కట్టె పెట్టినట్టు కంటోన్మెంట్ అభివృద్ధిని కేంద్రంలోని బీజేపీ సర్కార్ అడ్డుకుంటున్నదని మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. రహదారుల విస్తరణ, ఫ్లై ఓవర్ల నిర్మాణానికి రక్షణశాఖకు సంబంధించిన 100 ఎకరాలు ఇస్తే..దీనికి సరిసమానంగా శామీర్‌పేటలో 500 ఎకరాలు తిరిగి ప్రభుత్వ భూమిని అప్పగిస్తామని కోరినా పట్టించుకోవట్లేదని ఆరోపించారు.

### మీరు పెంచిన బిడ్డను..

'మీరు పెంచిన బిడ్డను నేను. మీరు ఓటేస్తే ఎమ్మెల్యే అయిన. మీ కోసం సేవ చేస్తున్న. మీ కోసం పని చేస్తున్న. బాధ్యతలు పెరిగినయి. మంత్రిగా, పార్టీకి అధ్యక్షుడిగా ఉన్నందున ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్రమంతా తిరగాల్సి వస్తుంది' అని కేటీఆర్ అన్నారు. ప్రతి ఊరికి, ప్రతి ఇంటికి రావాలని, ప్రతి ఒక్కరినీ కలవాలని ఉందని, రాష్ట్రమంతా తిరుగుతున్న కాబట్టి రాలేకపోతున్నానని చెప్పారు. తొమ్మిదిన్నరేండ్లలో చేసిన పని ప్రజల ముందున్నదని, కళ్ల ముందున్న అభివృద్ధిని చూసి నమ్మండని కోరారు. ఎవరో సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు, సన్నాయినొక్కులు నొక్కితే వాటికి పడిపోకండి అని విజ్ఞప్తి చేశారు. ప్రతి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమంలో పాలుపంచుకునేలా మీ తమ్ముడిలా మళ్లీ ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రపంచంలో ఎక్కడపోయిన నేను సిరిసిల్ల ఎమ్మెల్యేనని గర్వంగా చెప్పుకుంటున్నానని గుర్తు చేశారు. మీరు గర్వపడే విధంగా పని చేశానే తప్ప, తలవంచుకునేలా ఏ పని చెయ్యలేదని స్పష్టంచేశారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు కొత్త ప్రభాకర్‌రెడ్డి, లాస్య నందిత, తలసాని శ్రీనివాస్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నగేశ్, కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎన్నికల ఇంచార్జి ఎమ్మెన్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు పీఎల్ శ్రీనివాస్, సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఇంచార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సనత్‌నగర్ నియెజకవర్గంలోని అమీర్‌పేట రోడ్‌షోకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న మంత్రి కేటీఆర్. పక్కన బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని

## లోకం పోకడ




## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 15.9°c | 34.0°c |
| ఆదిలాబాద్ | 16.4°c | 34.8°c |
| మెదక్ | 16.6°c | 32.8°c |
| నల్లగొండ | 19.0°c | 33.9°c |
| నిజామాబాద్ | 19.3°c | 31.1°c |
| కరీంనగర్ | 21.0°c | 31.0°c |
| హైదరాబాద్ | 21.1°c | 29.0°c |
| మహబూబ్‌నగర్ | 21.5°c | 31.0°c |
| వరంగల్ | 22.0°c | 31.0°c |
| ఖమ్మం | 23.0°c | 31.0°c |

## తెలంగాణలో మూడు రోజులు వర్షాలు

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో వచ్చే మూడు రోజులు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనాలతో రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నారు. ఒకటి లేదా రెండు చోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చని తెలిపారు. ఈ నెల 23 నుంచి 26 వరకు హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపారు. ఆకాశం మేఘావృతమై ఉంటుందని చెప్పారు. ఈశాన్య దిశ నుంచి తెలంగాణ వైపు వీస్తున్న కిందిస్థాయి గాలుల ప్రభావంతో గ్రేటర్ హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 31.3, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 19.1 డిగ్రీలుగా నమోదయ్యాయి.


## కేంద్రం బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు కేసీఆర్ లొంగలేదు

- బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్



హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ) : వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టమని కేంద్రం చెప్పినా సీఎం కేసీఆర్ మీటర్లు పెట్టను అని ఇన్నాండ్లుగా చెప్పిన మాటలు నిజమని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొనడం పట్ల బీఆర్ఎస్ నేత దాసోజ్ శ్రవణ్ ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. కేంద్రప్రభుత్వం బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడిందని, అయినా కేసీఆర్ వాటికి లొంగలేదని చెప్పారు. కేసీఆర్‌కు రైతులు, వారి ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టంచేశారు. కాంగ్రెస్.. వ్యవసాయానికి మూడు గంటలే కరెంట్ ఇస్తామని చెప్తున్నదని, దీంతో ఆ పార్టీకి రైతులపై ఉన్న వైఖరేంటో బహిర్గతమైందని పేర్కొన్నారు. రైతాంగం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్, బీజేపీలను తరిమికొట్టి మరోసారి కేసీఆర్‌ను సీఎంగా ఎన్నుకొందామంటూ శ్రవణ్ పిలుపునిచ్చారు.






## మా ఓట్లన్నీ హరీశ్‌రావుకే..

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం మైసంపల్లిలోని దళిత కాలనీలో డబుల్ బెడ్రూం ఇండ్లు పొందిన లబ్ధిదారులు తమ ఓట్లన్నీ మంత్రి హరీశ్‌రావుకే వేస్తామని దర్వాజాలకు పోస్టర్లు అతికించారు. హరీశ్‌రావు సహకారంతోనే డబుల్ బెడ్రూం ఇండ్లు వచ్చాయని వారు పేర్కొన్నారు. కారు గుర్తుకు ఓటేసి తిరిగి హరీశ్‌రావును గెలిపించుకుంటామని వారు స్పష్టం చేశారు.
- నంగునూరు

## మాదిగలను మోసం చేసిందే బీజేపీ

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి



ముషీరాబాద్, నవంబర్ 21: అధికారంలోకి వచ్చి పదేండ్లయినా ఎస్సీ వర్గీకరణ చేయకుండా మాదిగలను మోసం చేసిన బీజేపీని మంద కృష్ణ మాదిగ ఎలా నమ్ముతారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ప్రశ్నించారు. ఇప్పుడు బీసీని ముఖ్యమంత్రిని చేస్తానంటున్న బీజేపీ మాటలు కూడా మోసమేనని పేర్కొన్నారు. విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో బీసీ నేతలు రాజకీయ పార్టీలు పెట్టినప్పుడు గానీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీ నేత బండి సంజయ్‌ని మార్చి కిషన్‌రెడ్డిని నియమించినప్పుడు గానీ మంద కృష్ణకు బీసీ నినాదం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఏదో ఒక పార్టీకి మద్దతు ఇవ్వడం, వర్గీకరణ అంశాన్ని పక్కకు నెట్టివేయడం మంద కృష్ణకు అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌తో కొన్నిరోజులు, చంద్రబాబుతో మరికొన్ని రోజులు, కిషన్‌రెడ్డి కనుసన్నల్లో కొద్దిరోజులు మంద కృష్ణ వర్గీకరణ ఉద్యమాన్ని నడుపుతూ వస్తున్నారని విమర్శించారు. నిజంగా వర్గీకరణ సాధించాలనే ఉద్దేశం ఉంటే వర్గీకరణకు అనుకూలంగా పార్టీలకు అండగా నిలవాలని హితవు పలికారు. గతంలో మాదిగలను మోసం చేసింది బీజేపీ.. ప్రధాని మోదీ నరహంతకుడు అన్న మంద కృష్ణ మళ్లీ అదే పార్టీ పంచన చేరడం స్వార్థ రాజకీయాలకు నిదర్శనమని దుయ్యబట్టారు.

# గులాబీ గుబాళింపు

- ఉద్యమపార్టీ బీఆర్ఎస్‌కే జనజేజేలు
- రాష్ట్రాన్ని తరగతిగది చేసిన సీఎం కేసీఆర్
- ప్రగతిపాఠంతో జనాల్లో విశేషాదరణ
- నల్లగొండ, ఖమ్మం, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల్లో బీఆర్ఎస్ ఆశీర్వాద సభలు పూర్తి

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో గులాబీ గుబాళిస్తున్నది. బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారసభలు జనజాతరను తలపిస్తున్నాయి. బీఆర్ఎస్ శ్రేణులు అన్నిస్థాయిల్లో కథానాయకులై ప్రజా ఆశీర్వాదసభలను విజయవంతం చేస్తున్నాయి. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాదసభల పేరుతో తెలంగాణను తరగతిగది చేశారు. ప్రతిసభలో ఆయన ప్రగతిపాఠాన్ని ప్రజలకు వివరిస్తున్న తీరు రాజకీయ పాఠశాలను తలపిస్తున్నది. పార్టీ ఆవిర్భావం నుంచి ఉద్యమ నిర్మాణంలో సుదీర్ఘపోరాటం, తెలంగాణ సాధన, తొమ్మిదిన్నరేండ్లుగా దేశానికి ఆదర్శంగా నిలిచిన ఉదంతాలను ప్రజా ఆశీర్వాద సభల సాక్షిగా కేసీఆర్ ఆవిష్కరిస్తున్నారు. గత నెల 15న హుస్నాబాద్‌లో మొదలైన ప్రజా ఆశీర్వాద సభలు 74 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ నెల 28న వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల సభల్లో పాల్గొని, గజ్వేల్‌లో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభతో ఈ ఎన్నికల సమరశంఖారావాన్ని పూర్తి చేయనున్నారు.

### రైతుల ముఖాల్లో చిరునవ్వు

రైతులకు రైతుబంధు, రైతుబీమా, 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తు, పంటకొనుగోలువంటి అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ చేసిన ప్రసంగాలకు రైతుల ముఖాల్లో చిరునవ్వు కనిపిస్తున్నది. తెలంగాణ అప్పుడెట్లుండే? ఇప్పుడెట్లుండే? అని సీఎం కేసీఆర్ వివరిస్తున్నప్పుడు జనం హర్షధ్వానాలు చేస్తున్నారు. తెలంగాణ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే కారు గుర్తుకే ఓటువేసి ముచ్చటగా మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించాలని రైతుసమాజం కంకణం కట్టుకున్నారని, అప్రతిహతంగా కొనసాగుతున్న సభలే ఇందుకు నిదర్శమని గులాబీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

### కాంగ్రెస్‌పై తిరుగుబాటు

3 గంటల కరెంట్ చాలు అని పీసీసీ అధ్యక్షుడు రేవంత్, తమ రాష్ట్రంలో 5 గంటల కరెంట్ ఇస్తున్నామని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ చేస్తున్న వాదనను సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభల్లో ప్రజలకు పూసగుచ్చినట్టు వివరిస్తున్నారు. సభా ప్రాంగణాల సాక్షిగా కాంగ్రెస్ గతచరిత్రను కండ్లకు కడుతున్నారు. దీంతో సభా ప్రాంగణాల నుంచి ఇండ్లకు చేరుతున్న ప్రజలు కాంగ్రెస్‌పై ఓటుతో తిరుగుబాటు చేస్తామనే విశ్వాసంతో వెళ్తున్నారని బీఆర్ఎస్ శ్రేణులు చెప్తున్నాయి. 3 గంటల కరెంటు కావాలా? 24 గంటలు కరెంటు కావాలా? అని కేసీఆర్ ప్రస్తావించగానే తమకు 24 గంటలు కరెంటు కావాలంటూ రైతులు చేతులెత్తి తమ ఆమోదాన్ని తెలుపుతున్నారు. ధరణి విషయంలోనూ కేసీఆర్ ప్రజల నుంచి స్పష్టమైన అభిప్రాయాన్ని కోరుతున్నారు. ధరణి ఉండాలా? వద్దా? అని ప్రజలను ప్రజా ఆశీర్వాద వేదికలపై నుంచి అడుగుతుంటే ఉండాలంటూ ముక్తకంఠంతో రైతులు ఆమోదం చెప్తున్న దృశ్యాలు ప్రతీ సభలో కనిపిస్తున్నాయి. సంక్షేమ పథకాలపై కేసీఆర్ మాట్లాడుతున్నప్పుడు సబ్బండ వర్ణాలు చప్పట్లు, ఈలలతో సభా ప్రాంగణాన్ని హోరెత్తిస్తున్నాయి.

### ప్రజా ఆశీర్వాద సభలు పూర్తయిన నియోజకవర్గాలివే

- **ఆదిలాబాద్:** నిర్మల్, ముథోల్, చెన్నూరు, సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, ఆదిలాబాద్, బోథ్.
- **కరీంనగర్:** హుస్నాబాద్, సిరిసిల్ల, ధర్మపురి, కోరుట్ల, మంథని, పెద్దపల్లి, కరీంనగర్, చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూరు.
- **నిజామాబాద్:** జుక్కల్, బాన్సువాడ, బాల్కొండ, ఆర్మూర్, కామారెడ్డి, బోధన్, నిజామాబాద్ అర్బన్, రూరల్, ఎల్లారెడ్డి
- **వరంగల్:** జనగామ, మహబూబాబాద్, వర్ధన్నపేట, నర్సంపేట, పాలకుర్తి, పరకాల, స్టేషన్‌ఘన్‌పూర్, డోర్నకల్, చేర్యాల (జనగామ నియోజకర్గంలో జరిగిన రెండు ప్రజా ఆశీర్వాదసభల్లో పాల్గొన్న సీఎం కేసీఆర్).
- **ఖమ్మం:** పాలేరు, సత్తుపల్లి, ఇల్లెందు, కొత్తగూడెం, ఖమ్మం, అశ్వారావుపేట, భద్రాచలం, పినపాక, మధిర, వైరా.
- **నల్లగొండ:** భువనగిరి, మునుగోడు, కోదాడ, తుంగతుర్తి, ఆలేరు, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జునసాగర్, నకిరేకల్, నల్లగొండ, సూర్యాపేట.
- **మహబూబ్‌నగర్:** జడ్చర్ల, అచ్చంపేట, వనపర్తి, గద్వాల, మక్తల్, నారాయణపేట, దేవరకద్ర, ఆలంపూర్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి
- **మెదక్:** సిద్దిపేట, నారాయణఖేడ్, మెదక్, నర్సాపూర్.
- **రంగారెడ్డి:** ఇబ్రహీంపట్నం, మేడ్చల్.

# తెలంగాణ రాష్ట్రం సోనియా భిక్ష

- అచ్చంపేట కాంగ్రెస్ అభ్యర్థి భార్య నోటి దురుసు
- వేలమంది ఆత్మబలిదానాలకు అవమానం

*హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): ప్రపంచ ఉద్యమాల చరిత్రలోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర పోరాటం ఒక అపూర్వ ఘట్టం. దోపిడీకి, పీడనకు వ్యతిరేకంగా దశాబ్దాలపాటు ప్రజాస్వామ్యయుతంగా, ఏమాత్రం దారితప్పకుండా సాగిన ఉద్యమం బహుశా ప్రపంచంలో ఇదొక్కటే. స్వరాష్ట్రం కోసం వేలమంది తెలంగాణ బిడ్డలు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. వందల మంది తెలంగాణ మేధావులు తమ ప్రసంగాలు, ఉద్యమాల ద్వారా 60 ఏండ్లపాటు తెలంగాణ ఆకాంక్షను ప్రజల్లో సజీవంగా ఉంచారు. దానికి కొనసాగింపుగా సీఎం కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీని స్థాపించి, అప్పటివరకు మేధో, విద్యార్థి ఉద్యమంగా ఉన్న తెలంగాణ ఆకాంక్షను ప్రజా ఉద్యమంగా మార్చి.. ఢిల్లీపై దండెత్తారు. భారత ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేసి తెలంగాణ రాష్ట్రాన్ని బాజాప్తా సాధించారు. ఈ విషయం తెలంగాణలో స్కూలు పిల్లవాడిని అడిగా చెప్తాడు. కానీ, కాంగ్రెస్ వాళ్లకు మాత్రం తెలంగాణ రాష్ట్రం ఆ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ వేసిన భిక్షనట! తెలంగాణ 4 కోట్ల మంది ప్రజలు బాధపడుతుంటే.. సోనియా గాంధీ భిక్ష వేశారట. ఈ మాటలన్నది అచ్చంపేట కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ సతీమణి అనురాధ. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. 'మనం ఈ రోజు నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతోటి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకొన్నాం. ఎంతోమంది తెలంగాణ బిడ్డలు ఆత్మబలిదానాలు చేసుకొంటే.. దాన్ని చూడలేక మన తల్లి సోనియాగాంధీ ఇచ్చిన భిక్ష ఈ తెలంగాణ రాష్ట్రం' అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై తెలంగాణవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పేగులు తెగేలా ఉద్యమం చేసి సాధించుకొన్న తెలంగాణను భిక్ష అంటారా? అని మండిపడుతున్నారు. సోషల్‌మీడియాలో కాంగ్రెస్‌పై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.*